దళితబంధు డౌటే..!



మేడ్చల్: దళితుల అభివృద్ధి కోసం ప్రభుత్వం రూ.10 లక్షలు మంజూరు చేసి వారి జీవితాల్లో వెలుగు నింపాలని ప్రవేశపెట్టిన దళితబంధు పథకం మేడ్చల్ నియోజకవర్గంలో ఇప్పటికిప్పుడు అందే పరిస్థితి కనిపించడం లేదు. మేడ్చల్ జిల్లాలో 3000 మందికి జిల్లాలో రెండో విడత కింద దళిత బంధు మంజూరు చేసి రుణాలు అందించాలని ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈక్రమంలో ఐదు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల వారీగా లిస్టు తయారు చేసి లబ్ధిదారులను ఎంపిక చేసి వారికి దళితబంధు మంజూరు చేయాలని సంతకాలు చేశారు. మేడ్చల్ నియోజకవర్గంలో 1100 మందికి రెండవ విడత దళితబంధు ఇవ్వాలని మంత్రి మల్లారెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియోజకవర్గంలో తన అనుచరుల ద్వారా దళితబంధు కోసం అర్హులైన వారి పేర్లను సేకరించి వాటిని సవరించి 1100 మంది పేర్లు తుదిజాబితాలో పొందుపరిచి సంతకాలు చేసి జిల్లా అధికారులకు పంపారు. అందరికీ దళితబంధు మంజూరు చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ఎన్నికలయ్యాకే దళితబంధు పంపిణీ..

త్వరలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో దళితబంధు పంపిణీ ఎన్నికలు పూర్తయ్యాకే చేయాలని మంత్రి మల్లారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు ఆలోచన చేస్తున్నట్లు తెలిసింది. ఎన్నికలకు ముందు దళితబంధు పంపిణీ చేస్తే రానివారితో ఇబ్బందులు వస్తాయని, వచ్చిన వారు పార్టీలో ఉంటారో లేదో అని స్థానికంగా చర్చ జరుగుతోంది. అందరికీ ఒకేసారి ఇవ్వడం సాధ్యంగా కాకపోవడంతో అందరికీ న్యాయం చేయలేమని, 1100 మందికి న్యాయం జరిగితే దరఖాస్తు చేసుకున్న మరో 2000 మందికి న్యాయం చేయలేమని, దాంతో అధికార పార్టీపై వ్యతిరేఖత వస్తుందని, ఓట్లు పడే అవకాశం ఉండదని నాయకులు దళితబంధు పథకాన్ని ఎన్నికల తర్వాత పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నట్లు అధికార బీఆర్ఎస్ నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు.

నాయకులే అడ్డుకుంటున్నారు..

దళితబంధు మంజూరు చేసి అందరికీ త్వరగా డబ్బులు అందజేయాలని మంత్రి మల్లారెడ్డి చెబుతున్నా స్థానిక నాయకులే అడ్డుకుంటున్నారని స్థానిక బీఆర్ఎస్ దళిత నాయకులు చెబుతున్నారు. గ్రామాల్లో కొంతమంది దళిత నాయకులు గ్రామాలను శాసించే స్థాయిలో ఉండటంతో రాజకీయంగా వారిని మభ్యపెట్టి ఎన్నికలు పూర్తయ్యే వరకు బీఆర్ఎస్‌తో అంటిపెట్టుకుని వారి పని చేసుకోవాలనే ఆలోచనలతో తాజాగా దళితబంధు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉంటాయో అప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉంటుందో లేదో, ఎమ్మెల్యేగా మంత్రి మల్లారెడ్డి ఉంటారో లేదో ఇలా.. ఎన్నో అనుమానాలు ఉన్నాయని, ఇప్పుడే దళితబంధు ఇస్తే ఎవరికి ఇబ్బంది ఉండదని ఎన్నికలు పూర్తయ్యే వరకు తమను ఎవరు పట్టించుకుంటారో లేదో అనే అనుమనాలు దళిత నాయకుల నుంచి వ్యక్తం అవుతున్నాయి.

అందరికీ పంపిణీ చేస్తాం..

ఎన్నికలకు ముందా.. ఎన్నికల తర్వాతా.. చెప్పలేం కానీ దరఖాస్తు చేసుకున్న అందరికీ తప్పకుండా దళితబంధు పథకాన్ని అమలు చేస్తాం. మంత్రి మల్లారెడ్డి మేడ్చల్ నియోజకవర్గం లిస్ట్ ఇప్పటికే అందజేశారు. దరఖాస్తు దారుల డేటా అప్‌లోడ్ చేయడం, ఎంక్వైరీ చేయడం .. కొటేషన్లు తేవడం వంటి వాటితో నడుస్తుంది. అన్ని ప్రక్రియలు పూర్తి చేశాక అందరికీ అందజేస్తాం.

- బాలాజీ,
జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ

క్లుప్తంగా...

కరెంటు ఉండని ప్రాంతాలు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ సబ్‌స్టేషన్ పరిధి కేవీరెడ్డి నగర్ ఫీడర్ చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా ఫీడర్ పరిధిలో ఉన్న పలు కాలనీల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ వెంకట్‌గౌడ్ తెలిపారు. బిగ్ బాస్కెట్, మేడ్చల్ హైవే, ఇండియన్ పెట్రోల్ బంక్ తదితర కాలనీలకు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3.30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.

లక్ష్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో..

శామీర్‌పేట్: లక్ష్మాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని అలియాబాద్ ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. లక్ష్మాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మూడుచింతలపల్లి, పోతారం గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు వివరించారు.

ఎంపీడీఓగా గ్యామ



కీసర: కీసర మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పి.గ్యామ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. సూర్యపేట్ జిల్లా పరిషత్ నుంచి బదిలీపై కీసరకు వచ్చారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం



క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న మేయర్ కావ్య, కమిషనర్ రామలింగం

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం మేయర్ మేకల కావ్య, కమిషనర్ రామలింగం ఆధ్వర్యంలో క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మేయర్ కావ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తూ అత్యధిక నిధులు కేటాయిస్తోందని అన్నారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో ప్రతి పల్లెకు, పట్టణానికి క్రీడా మైదానాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

మూడో వార్డులో అభివృద్ధి పనులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ దీపికారెడ్డి

మేడ్చల్: పట్టణంలోని 23 వార్డులను దశలవారీగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి అన్నారు. పట్టణంలోని మూడవ వార్డులో కౌన్సిలర్ దేవరాజుతో కలిసి సీసీ రోడ్డు, భూగర్భ డ్రైనేజీ పనులు ఆమె ప్రారంభించారు. వార్డులో రూ.20 లక్షలతో సీసీ పనులు, రూ.20 లక్షలతో డ్రైనేజీ పనులు చేపట్టినట్లు తెలిపారు. వార్డు అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు వార్డు నాయకులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వనవాసీ ప్రదర్శన



పోచారం: అన్నోజిగూడలోని రాష్ట్రీయ విద్యా కేంద్రంలో అఖిల భారత వనవాసీ కల్యాణ్ ఆశ్రమం కార్యక్రమావళిని తెలిపే ప్రదర్శనను ప్రముఖ వ్యాపారవేత్త సీఎస్ఆర్ ప్రసాద్ గురువారం సాయంత్రం ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో ఏర్పాటు చేసిన చిత్రాలను పరిశీలించారు. 70 ఏళ్లుగా ఆశ్రమం నిర్వహించిన కార్యక్రమాలను వివరించే చిత్రాలు ప్రదర్శనలో ఉన్నాయి. అఖిల భారత వనవాసీ అధ్యక్షుడు రామచంద్ర ఖరాడే అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. పలు ప్రాంతాలకు చెందిన విద్యార్థులతో పాటు వచ్చిన వనవాసీ ప్రతినిధులను ప్రదర్శన ఆకట్టుకుంది.

నేడు ఉప్పల్ ఫైర్ స్టేషన్ ప్రారంభం

ఉప్పల్: ఉప్పల్ భగాయత్ లే అవుట్‌లో గతేడాది నిర్మించిన ఫైర్ స్టేషన్‌ను శుక్రవారం ఉదయం రాష్ట్ర హోంశాఖ మంత్రి మహ్మద్ మహమూద్ అలీ, ఫైర్ శాఖ ఉన్నతాధికారులతో కలిసి ప్రారంభించనున్నారు. దీంతో పాటు మరో 17 కొత్త ఫైర్ స్టేషన్లను వర్చువల్‌గా ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం



వెంకటాపూర్‌లో ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ గీతశ్రీనివాస్‌ముదిరాజ్

మంత్రి శ్రీనివాస్‌యాదవ్

ఘట్‌కేసర్: రాష్ట్రంలో పేదల సొంతింటి కలను సాకారం చేస్తున్నామని మంత్రి శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మండలం వెంకటాపూర్ నిర్మించిన రెండు పడకల ఇళ్ల పట్టాలను ఉప్పల్ నియోజకవర్గానికి చెందిన 720 మంది లబ్ధిదారులకు గురువారం పంపిణీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ జీహెచ్ఎంసీ పరిధిలో రూ.10 వేల కోట్లతో 66 వేల ఇళ్లను నిర్మించామని, మరో 34 వేల ఇళ్లను నిర్మిస్తామన్నారు. పేదలందరికీ ఇళ్లు ఇవ్వాలన్న ఆకాంక్షతో ముందుకెళ్తున్న సీఎం కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. కాగా వెంకటాపూర్‌లో నిర్మించిన ఇళ్లలో 50 శాతం ఇళ్లను స్థానికులకు కేటాయించాలని నిరసనకు దిగిన సీపీఐ, సీపీఎం నాయకులు జయచంద్ర, ఈశ్వర్, సబితతో పాటు మరి కొందరిని పోలీసులు అరెస్టు చేసి పీఎస్‌కు తరలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ అరుణ, ఎంపీఓ నందకిశోర్, సర్పంచ్ గీతశ్రీనివాస్, ఎంపీటీసీ రామారావుముదిరాజ్, ఆర్ఐ అలేఖ్య, పద్మాచారి, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలు

కీసర: రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయంలో లబ్ధిదారులకు బ్లాక్ నంబర్లతో పాటు ఫ్లాట్ సంఖ్యలను లాటరీ పద్ధతిలో డిప్యూటీ స్పీకర్ టీ.పద్మారావు గురువారం కేటాయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం పేదల సొంతింటి స్వప్నం సాకారమైందన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. సొంత జాగా ఉంటే ఇల్లు నిర్మించుకునేందుకు గృహలక్ష్మి పథకం కింద ఆర్థిక సాయం అందుతుందన్నారు. ఉప్పల్ ప్రాంతం నుంచి 601, యాకుత్‌పురా నుంచి 1080, అంబర్‌పేట్ నుంచి 1164 మందికి ఇళ్లు దక్కాయని, వీరికి బ్లాక్ నంబరుతో పాటు ఫ్లాట్ నంబర్ కేటాయించామన్నారు. కార్యక్రమంలో నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కమిషనర్ జి.రాజేందర్ కుమార్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.



డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు



మురహరిపల్లిలో లబ్ధిదారులకు పట్టాలను అందజేస్తున్న మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్

సొంతింటి కల నెరవేర్చాం..

శామీర్‌పేట్: డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకం దేశంలో ఎక్కడా లేదని మంత్రి చామకూర మల్లారెడ్డి, హైదరాబాద్ డిప్యూటీ మేయర్ శ్రీతలశోభన్‌రెడ్డి అన్నారు. నగరంలోని ముషీరాబాద్, సికింద్రాబాద్, అంబర్‌పేట్ నియోజకవర్గాల్లోని అర్హులకు ఉమ్మడి శామీర్‌పేట మండలంలోని తూంకుంటలో 1548, మురహరిపల్లిలో 2376 డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించారు. వాటిని లబ్ధిదారులకు గురువారం మంత్రి మల్లారెడ్డి, హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ శ్రీతలశోభన్‌రెడ్డితో కలిసి పట్టాలను అందజేశారు. పచ్చని ప్రకృతిలో డబుల్ ఇళ్ల కాలనీ ఏర్పాటు చేశామని, ఇక్కడ చుట్టుపక్కల అనేక ఫార్మా కంపెనీలు ఉన్నాయని, ఉద్యోగాలు కూడా లభిస్తాయని వివరించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ ముఠా గోపాల్, పలువురు కార్పొరేటర్లు, పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

జవహర్‌నగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం

మేయర్ కావ్య



జవహర్‌నగర్‌లో కౌన్సిల్ సమావేశంలో మేయర్ కావ్య తదితరులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ మేకల కావ్య ఆధ్వర్యంలో గురువారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. జవహర్‌నగర్ అంతటా శానిటేషన్ పనులు నిర్వహించాలని, ప్రతి ఆడబిడ్డకు బతుకమ్మ చీరలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో డ్రైనేజీ, అవుట్‌లెట్ సమస్య, శానిటేషన్ వంటి మౌలిక వసతుల కోసం రూ.68 లక్షలను కేటాయిస్తూ ఏకగ్రీవంగా సభ్యులు తీర్మానం చేస్తూ ఆమోదం తెలిపారు. అదేవిధంగా నూతన కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటు కోసం ఐదు ఎకరాల స్థలం కేటాయించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు తీర్మానం చేశారు. కార్యక్రమంలో కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, ఆర్వో ప్రభాకర్‌యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి



జవహర్‌నగర్: అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు అందజేయాలని కోరుతూ సీపీఐ ఆధ్వర్యంలో గురువారం జవహర్‌నగర్‌లో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ మేడ్చల్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తోటపల్లి శంకర్ మాట్లాడుతూ.. జవహర్‌నగర్‌లో పేదలే నివసిస్తున్నారని, స్థానికులకు 50 శాతం కోటా కల్పించాలన్నారు. స్థానికులకు ఇవ్వకుండా బయటి వారికి ఇళ్లను కేటాయించడం ఏమిటని, అర్హులైన పేదలకు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో స్వరూప, రాజేశ్వరి, నర్సింహులు, రాజు, కవిత, విజయ, మల్లిక, శివ తదితరులు పాల్గొన్నారు.

డీఎల్‌పీఓపై సీఎస్‌కు ఫిర్యాదు

మేడ్చల్: జిల్లాలోని కీసర డివిజనల్ పంచాయతీ అధికారి(డీఎల్‌పీఓ) స్మితపై మండల మాజీ అధ్యక్షుడు నరేందర్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి శాంతికుమారికి ఫిర్యాదు చేశారు. సచివాలయంలో ఆయన ఫిర్యాదు చేశారు. డీఎల్‌పీఓ స్మిత అక్రమార్కులకు సహకరిస్తూ ప్రజాధనాన్ని దుర్వినియోగానికి సహకరిస్తున్నారని ఆమెపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. అక్రమార్కులతో ఒప్పందాలు చేసుకుని బాధితులు ఫిర్యాదు చేస్తే డబ్బులు ఇస్తే ఒక రకంగా, ఇవ్వకపోతే మరో విధంగా నివేదికలు ఇస్తూ తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలి



మేడ్చల్‌లో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

మేడ్చల్: మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, పెంచిన వేతనాలను వెంటనే చెల్లించాలని మధ్యాహ్న భోజన కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. మేడ్చల్‌లో నిర్వహించిన మధ్యాహ్న కార్మికుల సమ్మెలో భాగంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. పేద పిల్లలకు పాఠశాలలో నిత్యం భోజనం వండి పెడుతున్న కార్మికులకు ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో వారు అప్పుల పాలవుతున్నారని అన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.18 వేలు అమలు చేయాలని, నాణ్యమైన చీరలను అందించాలని, రూ.5 లక్షల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు అశోక్, ప్రేమలత, స్వరూప, విజయలక్ష్మి, భాగ్యమ్మ తదితరులు పాల్గొన్నారు.

వినూత్న జ్ఞానమే లక్ష్యంగా..



సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న వినాయక్ భండార్కర్, యూనివర్సిటీ ప్రొఫెసర్లు

ఘట్‌కేసర్: విద్యార్థులకు వినూత్న జ్ఞానాన్ని అందించడమే టెక్నికల్ క్లబ్ లక్ష్యమని డిజిటల్ మానుఫ్యాక్చరింగ్ జనరల్ మేనేజర్ వినాయక్ భండార్కర్ అన్నారు. వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో మెకానికల్ ఇంజనీరింగ్ విభాగంలో సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ డిజిటల్ మానుఫాక్చరింగ్ క్లబ్(డిమాక్)ను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిజిటల్ తయారీ రంగంలో జాతీయ స్థాయి సాంకేతిక వర్క్‌షాప్‌లు, సెమినార్లు, గెస్ట్ లెక్చరర్లను నిర్వహించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో డీన్ విజయకుమార్, హెచ్‌ఓడీ శ్రీనివాస్, కో ఆర్డినేటర్ మదనమోహన్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

మంత్రి మల్లారెడ్డి



ప్రమాణ స్వీకారంలో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్‌రూరల్: రాష్ట్రంలోని అన్ని మతాల ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయ నూతన కమిటీ ప్రమాణస్వీకారంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి ప్రజాసేవతో పాటు దైవ చింతన కలిగినవాడని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎన్నో యాగాలు చేసిన వ్యక్తి అని తెలిపారు. యాదాద్రి ఆలయాన్ని తిరుమల తరహాలో గొప్ప దివ్య క్షేత్రంగా తీర్చిదిద్దాడని, రాష్ట్రంలోని అన్ని ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తున్నాడని వివరించారు. గుండ్లపోచంపల్లిలో పురాతన కాలంనాటి ఆలయంగా పేరుగాంచిన లక్ష్మీనారాయణస్వామి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

ఆలయ చైర్మన్‌గా దామన్నగారి కృష్ణారెడ్డి

లక్ష్మీనారాయణ స్వామి ఆలయ నూతన చైర్మన్‌గా దామన్నగారి కృష్ణారెడ్డి, ధర్మకర్తలుగా దొడ్ల మధు ముదిరాజ్, జైత్వాల ప్రదీప్‌వర్మ, సద్ది మధుసూదన్ రెడ్డి, డప్పు ప్రమీల ప్రమాణ స్వీకారం చేశారు. ఆలయ ఈఓ కృష్ణమాచారి వీరితో ప్రమాణ స్వీకారం చేయించారు. అక్కన్న మాదన్నల కాలం నాటి పురాతమైన, ఎంతో చరిత్ర కలిగిన శ్రీలక్ష్మీనారాయణ స్వామి దేవాలయ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించడం అదృష్టంగా భావిస్తున్నానని దామన్నగారి కృష్ణారెడ్డి అన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ ప్రభాకర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్‌యాదవ్, కౌన్సిలర్లు అమరం జైపాల్‌రెడ్డి, మల్లిఖార్జున్ ముదిరాజ్, హేమంత్‌రెడ్డి, బాలరాజు, నాయకులు పాల్గొన్నారు.

జోరుగా అభివృద్ధి పనులు ప్రారంభం



26వేల రూపాయి, రెండు రూపాయల బిల్లలతో మంత్రి మల్లారెడ్డికి తులాభారం చేస్తున్న 14వ వార్డు కౌన్సిలర్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి తదితరులు



అన్నోజిగూడలోని ఆర్జీకే కాలనీలో షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: మేడ్చల్ మండలంలోని వివిధ గ్రామాలు, పట్టణంలోని వివిధ వార్డుల్లో మంత్రి మల్లారెడ్డి సుడిగాలి పర్యటన చేసి పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు. మైసిరెడ్డిపల్లి, కోనాయిపల్లి, సైదనిగడ్డ తండాల్లో పర్యటించి మూడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాలను ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించి సీసీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజ విజయానందరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ దీపికనర్సింహరెడ్డి, సర్పంచ్‌లు కరుణాకర్, శేఖర్, సుజాత కిషన్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. అనంతరం 14వ వార్డు కౌన్సిలర్ 26 వేల రూపాయి, రెండు రూపాయల బిల్లలతో మంత్రి మల్లారెడ్డికి తులాభారం చేశారు.

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం..

శామీర్‌పేట్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. సీఎం దత్తత మండలమైన మూడుచింతలపల్లిలో ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) ద్వారా నిర్మించిన మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని గురువారం మంత్రి మల్లారెడ్డి ప్రారంభించారు. అనంతరం కళ్యాణలక్ష్మీ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హారిక, మండల వైద్యాధికారి దమయంతి, స్థానిక సర్పంచ్ జాం రవి, ఎంపీటీసీ నాగరాజు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం

ఘట్‌కేసర్: తెలంగాణ ప్రభుత్వం వైద్యరంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని మంత్రి మల్లారెడ్డి అన్నారు. జాతీయ ఆరోగ్య మిషన్‌లో భాగంగా గురువారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నవజాత శిశువు సంరక్షణ విభాగం వార్డును చైర్ పర్సన్ పావనీజంగయ్య, ఆస్పత్రి సూపరింటెండెంట్ కోట్యానాయక్‌తో కలిసి మంత్రి ప్రారంభించారు. జిల్లా అదనపు వైద్య ఆరోగ్య అధికారి నారాయణరావు, ఆర్ఎంఓ రాజేంద్రప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ అనురాధ, విష్ణువర్ధన్‌రెడ్డి, మల్లేశ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

దేశంలో అభివృద్ధికి కేరాఫ్‌గా తెలంగాణ

మున్సిపాలిటీలో రూ.4.5 కోట్లతో చేపట్టనున్న వెజ్–నాన్ వెజ్ మార్కెట్ షెడ్డు పనులకు చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి గురువారం మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేశారు. వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, సంగీత, ఆంజనేయులుగౌడ్, అనురాధ, నస్రీన్ సుల్తానా, నాగజ్యోతి, హేమలత, శశికళ, మల్లేశ్, నర్సింగ్‌రావు, రవీందర్, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్జీకేలో షాపింగ్ కాంప్లెక్స్

పోచారం: ప్రజల సౌకర్యార్థం అన్నోజిగూడలోని ఆర్జీకే కాలనీలో రూ.50 లక్షలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్ అందరికీ అందుబాటులోకి వచ్చిందని కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. గురువారం షాపింగ్ కాంప్లెక్స్‌ను ఆయన ప్రారంభించారు. ఎస్‌పీసీ ఆధ్వర్యంలో 30 మందికి కుట్టు మిషన్లు అందజేశారు. 7వ వార్డులో భూగర్భ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి, కమిషనర్ వేమన రెడ్డి, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, ఆకిటి శైలజ, మెట్టు బాల్‌రెడ్డి, బైర హిమ, బాలగోని వెంకటేశ్ గౌడ్, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో చిన్న పిల్లల వార్డు ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి తదితరులు



మూడుచింతలపల్లిలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి మల్లారెడ్డి



ఘట్‌కేసర్‌లో మార్కెట్ షెడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి